డిగ్రీ చదువులకు ప్రైవేటే దిక్కు!

- రెవెన్యూ డివిజన్ కేంద్రంలో లేని ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల చేరిక
- దూరాభారం, అధిక ఫీజులతో ఇబ్బందులు



నూజివీడులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

నూజివీడు: డిగ్రీ చదవాలనే నూజివీడు నియోజకవర్గ విద్యార్థులకు ప్రైవేటు కళాశాలలే దిక్కవుతున్నాయి. నియోజకవర్గంలో ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా లేకపోవడంతో పేద, నిరుపేద విద్యార్థులకు శాపంగా మారింది. ప్రైవేటు కళాశాలల ఫీజుల మోతతో చాలా మంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే పరిస్థితులు సైతం నెలకొంటున్నాయి.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు లెక్చరర్ల బదిలీ

నూజివీడు నియోజకవర్గంలో మున్సిపాలిటీ, నాలుగు మండలాలు ఉన్నప్పటికీ ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా 100కు పైగా గ్రామాలున్నాయి. వందలాది మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. గతంలో నూజివీడు పట్టణంలో ధర్మ అప్పారావు డిగ్రీ కళాశాల ఎయిడెడ్ కళాశాలగా నిర్వహించగా ప్రైవేటు కళాశాలల పోటీని తట్టుకోలేకపోయింది. దీంతో రానురాను విద్యార్థులు పూర్తిగా తగ్గిపోవడంతో విద్యార్థులే లేకుండా పోయారు. ఈ పరిస్థితుల్లో కళాశాలలోని లెక్చరర్లందరిని ప్రభుత్వాలు వేరే ప్రాంతాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు బదిలీ చేశాయి. దీంతో ప్రైవేటు డిగ్రీ కళాశాలలే ఈ ప్రాంత విద్యార్థులకు దిక్కుగా మారాయి. చాట్రాయి మండలానికి చెందిన విద్యార్థులు ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు వెళ్తుండగా, ముసునూరు మండలానికి చెందిన విద్యార్థులు ఏలూరు, నూజివీడుల్లోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు వెళ్తున్నారు. నూజివీడు, ఆగిరిపల్లి మండలంలోని విద్యార్థులు నూజివీడు, విజయవాడలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు వెళ్లి చదువుకుంటున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలే లేకపోవడంతో పేద, నిరుపేద విద్యార్థులు సైతం వేలాది రూపాయల ఫీజులు చెల్లించి ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లోనే చేరాల్సి వస్తోంది. ఆ తర్వాత ఫీజుల భారం మోయలేక చాలా మంది చదువులను మధ్యలోనే మానేసి ఇంటి ముఖం పడుతున్నారు. ఇప్పటికైనా నూజివీడులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని చుట్టు పక్కల మండలాల విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావంతులు కోరుతున్నారు.

విద్యార్థులకు తప్పని ఆర్థిక ఇబ్బందులు



నూజివీడులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక ప్రైవేటు కళాశాలల్లో చదువుకోవడానికి పేదవర్గాల విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కళాశాల ఫీజులు, పుస్తకాల ఫీజులు, రవాణా ఖర్చులు, రూమ్ రెంట్‌లు తదితర వాటికి వేలాది రూపాయలు ఖర్చవుతున్నాయి. ప్రభుత్వం డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలి.

– ఉన్నం అనిల్‌కుమార్, ఏఐఎస్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



నూజివీడు నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవసరం ఎంతో ఉంది. ఈ ప్రాంత పేద, నిరుపేద వర్గాల పిల్లలు డిగ్రీ చదువుకోవాలంటే డబ్బులు చెల్లించలేక ఇళ్లకే పరిమితమవుతున్నారు. ప్రభుత్వం వెంటనే డిగ్రీ కళాశాలను మంజూరు చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలి.

– డి.శివకుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు

పీజీఆర్‌ఎస్‌లో సమస్యల వెల్లువ



తిరువూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు చేస్తున్న ప్రజలు

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో తిరువూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధిక సంఖ్యలో అర్జీలు వచ్చాయి. అర్జీలు దాఖలు చేయడానికి విచ్చేసిన ప్రజలకు ప్రత్యేక కౌంటర్లలో టోకెన్లు ఇచ్చిన తదుపరి కలెక్టరు వద్దకు పంపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. అర్జీల్లో కొన్ని..

- తిరువూరు పట్టణంలో దేవుని మాన్యం భూముల పేరుతో నివేశనస్థలాల రిజిస్ట్రేషన్లను నిలిపివేయడంతో పేద, మధ్య తరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున నిషేధం ఎత్తివేయాలని శాంతినగర్, అశోక్‌నగర్, సుగాలీ కాలనీ వాసులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.
- ఏ కొండూరు మండలం పోలిశెట్టిపాడులో రెవెన్యూ అధికారుల సహకారంతో ఇతరుల భూమిని ఇద్దరు వ్యక్తులు తమ వద్ద రూ.14 లక్షలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసి మోసగించారని ఆనం వినయ్‌బాబు ఫిర్యాదు చేశారు. లేని భూమికి ఏ.కొండూరు తహసీల్దారు కార్యాలయంలో పట్టాదారు పాసుపుస్తకాలను సైతం నిందితులు సృష్టించారని, ఈ మోసంపై తాము ఫిర్యాదు చేసినా పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవట్లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- విస్సన్నపేట మండలం పుట్రేలలో తమ హక్కు భుక్తంలో ఉన్న భూములకు ఆన్‌లైన్‌లో తమ పేర్లు తొలగించారని, తమకు న్యాయం చేయాలని రైతులు సూర్యనారాయణరెడ్డి, చంద్రశేఖరరెడ్డి పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందజేశారు.
- తిరువూరు పట్టణానికి తాగునీరందించాలని, కృష్ణా జలాలను వెంటనే సరఫరా చేయాలని, పైలట్ ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని, తిరువూరు నగరపంచాయతీలో అసంపూర్తిగా నిర్మించిన రహదారుల పనులు పూర్తిచేయాలని, పైపులైన్ల నిర్మాణం పేరుతో పగులగొట్టిన సీసీ రహదారులకు మరమ్మతు చేయాలని పలువురు అర్జీలు అందజేశారు.
- తిరువూరు పట్టణంలో అక్రమంగా నిర్మించిన భవనంపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవట్లేదని, నగర పంచాయతీ అనుమతులు సైతం లేకుండా ఈ భవనం నిర్మించారని 9వ వార్డు కౌన్సిలర్ దుర్గారావు ఫిర్యాదు చేశారు.

ఘనంగా మద్దిరావమ్మ తల్లి మహోత్సవం

చెక్కపల్లి(ముసునూరు): మండలంలోని చెక్కపల్లిలో కొలువై ఉన్న గ్రామదేవత మద్దిరావమ్మకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆడపడుచులు, భక్తులు, గ్రామస్తులంతా అమ్మవారిని దర్శించుకున్నారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం చీర, సారె, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో స్థానిక భక్తులు ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

మాజీ మంత్రి విడదల రజనీ పట్ల పోలీసుల తీరు అమానుషం

చాట్రాయి: బీసీ మహిళ, మాజీ మంత్రి విడదల రజనీపై పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణమని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పరసా చెన్నారావు ధ్వజమెత్తారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మహిళల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై మాట్లాడితే కేసులు పెట్టడం పనిగా కూటమి ప్రభుత్వ పాలన ఉందని ఆయన విమర్శించారు. అక్రమ కేసులు మానేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సారా తయారీదారుల అరెస్ట్

చాట్రాయి: సారా తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్‌ఐ మస్తానరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోతనపల్లి తండాకు చెందిన ధారావతు చంటి, ఆరావతు దేవి, చిన్నంపేట గ్రామానికి చెందిన పరసా నాగేశ్వరరావు గతంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడడంతో అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం తిరువూరు కోర్టుకు తరలించామన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు దగ్ధం



తిరువూరు: స్థానిక సాయి రాఘవ ఎస్టేట్స్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సు సోమవారం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. పాఠశాలకు సెలవులు కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు లేని సమయంలో పాఠశాల ఆవరణలోని బస్సు నుంచి మంటలు రావడంతో చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. బస్సు పూర్తిగా దగ్ధమైందని పాఠశాల నిర్వాహకులు తెలిపారు.

పాకిస్తాన్‌పై సైనికుల చర్య ప్రశంసనీయం



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ అనూరాధ, అధికారులు, పాత్రికేయులు, విద్యార్థులు

మైలవరం: పాకిస్తాన్‌పై భారతీయ సైనికులు జరిపిన ప్రతిఘటన చర్య ప్రశంసనీయమని ఎంపీడీఓ పి.అనూరాధ తెలిపారు. పహల్గాం ఘటనలో ముష్కర మూకల దాడిలో అసువులు బాసిన సైనికులకు, పౌరులకు బాసటగా నిలుస్తూ భారత దేశ సైన్యం పాకిస్తాన్‌పై జరిపిన సైనిక చర్యని సమర్థిస్తూ, మన సైనికుల సామర్థ్యానికి గర్విస్తూ మైలవరంలో జర్నలిస్టుల ఆధ్వర్యంలో సోమవారం సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. మైలవరం బస్టాండ్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, పంచాయతీ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు.

మన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు..

ఎంపీడీఓ అనూరాధ మాట్లాడుతూ.. భారత సైనికుల సామర్థ్యాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేశారన్నారు. ప్రపంచ శాంతిని కోరుకునే భారతీయులు అవసరమైతే తమ ధైర్య సాహసాలను కూడా ప్రదర్శిస్తారని చాటి చెప్పారన్నారు. ఆర్మీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈ.ప్రసన్నరాణి, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ, ఎస్ఎస్‌కే పాఠశాల డైరెక్టర్ జి.మోహనరావు, శ్రీలీలావతి గిరిజన పాఠశాల హెచ్ఎం ఉడతా లక్ష్మీనారాయణ, వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, జర్నలిస్టులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాకీర్ హుస్సేన్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ మహబాషా మృతి



మహబాషా(ఫైల్)

ఇబ్రహీంపట్నం: జాకీర్ హుస్సేన్ డిగ్రీ కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్, తెలుగు భాషాభిమాని ఎస్.మహబాషా (70) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించడడంతో సోమవారం తుదిశ్వాస విడిచారు. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో అందరికీ సుపరిచితులైన మహబాషా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. అక్షర భారతి కార్యక్రమంతో ఎంతోమంది వయోజనులకు విద్య అందించారు. ఎయిడ్స్ నిర్మూలనకు ఎన్ఎస్ఎస్ యూనిట్ల ద్వారా అవగాహన కల్పించారు. తెలుగు భాష అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు. ఆయన మృతదేహానికి పలువురు ప్రముఖులు, అధ్యాపకులు విద్యార్థులు నివాళులర్పించారు.

ఎల్‌బీఆర్సీఈ రీసెర్చ్ సెంటర్‌కు జేఎన్‌టీయూకే గుర్తింపు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల రీసెర్చ్ సెంటర్‌కు జేఎన్‌టీయూకే కాకినాడ గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు సోమవారం తెలిపారు. జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ ఈసీఈ, సీఎస్ఈ, ఈఈఈ, ఎంఈకు చెందిన ప్రతినిధుల బృందం కళాశాలలోని ఆయా విభాగాలను సందర్శించింది. పరిశోధన చేయడానికి అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఇతర మౌలిక లాబరేటరీ సదుపాయాలు ఉన్నాయని, పీహెచ్‌డీ చేయు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటిని పరిశీలించిన ప్రతినిధుల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈసీఈ, సీఎస్ఈ, ఈఈఈ, ఎంఈ విభాగాలకు రీసెర్చ్ సెంటర్ గుర్తింపును రెండేళ్ల(2025 – 27) రెన్యూవల్ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులు ఈ రీసెర్చ్ సెంటర్‌ను ఉపయోగించుకుని మంచి పరిశోధనలు చేసి కళాశాలకు గుర్తింపు తీసుకురావాలన్నారు. ఇతర కళాశాలలకు చెందిన అధ్యాపకులు కూడా పరిశోధన సదుపాయాలు ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

అందుబాటులో ఆర్టీసీ కార్గో కంటైనర్

నూజివీడు: నూజివీడు పరిసర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు మామిడి పండ్లు పంపేందుకు, ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ కార్గో కంటైనర్‌ను ప్రతి శుక్ర, శని వారాల్లో హైదరాబాద్‌కు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ సూర్య పవన్ కుమార్ సోమవారం తెలిపారు. బీహెచ్ఈఎల్, ఈసీఐఎల్, జీడీమెట్ల, కేపీహెచ్‌బీ, మియాపూర్ తదితర ప్రాంతాల్లోని బంధువులకు మామిడి పండ్లు బాక్సులు, బస్తాలను పంపాలన్నా ఈ కంటైనర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎం విజ్ఞప్తి చేశారు. వివరాలకు 77299 07729, 73829 01757 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆలయ పాలకవర్గాల నియామకానికి నోటిఫికేషన్ జారీ

తిరువూరు: తిరువూరు గ్రూపు దేవాలయాల పాలకవర్గాల నియామకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని దేవదాయశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. తిరువూరులోని శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీవెంకటాచలస్వామి దేవస్థానాలకు పాలకవర్గాలను నియమించనున్నట్లు దేవదాయశాఖ తెలిపింది. అర్హతలు, ఇతర వివరాలకు దేవాలయాల మేనేజరు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ నెల 26వ తేదీలోగా సంబంధిత దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

మీ కోసంలో అర్జీలను సకాలంలో పరిష్కరించాలి



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం) కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన అర్జీల పరిష్కారం నాణ్యతతో ఉండాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఏమాత్రం అలసత్వం వహించినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, పీపీ యూనిట్ వైద్యాధికారి గంగాధర్‌రావు, ఇన్‌చార్జి ఏడీఏ ఏ.చాముండేశ్వరి, హెచ్ఓఆర్ హేమ, డీఎల్‌పీఓ సుందరి తదితరులు పాల్గొన్నారు. మీ కోసంలో 13 అర్జీలు రాగా వాటిలో కొన్ని ఇలా ఉన్నాయి.

- చందర్లపాడు తహసీల్దార్‌పై భూ వివాదంపై గతంలో ఫిర్యాదు చేశానని, అయితే దానిపై నూజివీడు తహసీల్దార్, పోలీసు అధికారులు సమస్యను పరిష్కరించకుండానే సమస్యపై చర్య అవసరం లేదంటూ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారన్నారు. దానిని నిరాకరించానని, తన సమస్యను పరిష్కరించాలని నూజివీడుకు చెందిన కొలుసు సత్యనారాయణ అర్జీని అందజేశారు.
- నూజివీడు మండలం తుక్కులూరులో పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించిన విషయంపై తాను మీ కోసంలో ఫిర్యాదు చేశానని, అయితే అధికారులు తనకు సమాచారమేమీ ఇవ్వకుండా విచారణ చేసి తన సమక్షంలో విచారణ చేసినట్లుగా చెబుతున్నారని, ఇంత వరకు ఆక్రమణను తొలగించకుండా వదిలేశారని పేర్కొంటూ గ్రామానికి చెందిన తమ్మిశెట్టి శ్రీనివాసరావు అర్జీ అందజేశారు.
- తండ్రి నుంచి సంక్రమించిన ఆస్తిని సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కొన్ని నెలలుగా తిరుగుతున్నా ముసునూరు రెవెన్యూ కార్యాలయం అధికారులు పట్టించుకోవడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ముసునూరు మండలం గుళ్లపూడికి చెందిన కూరపాటి సత్యనారాయణ అర్జీ అందజేశారు.

అమరవీరుడు మురళీనాయక్‌కు నివాళి



కంభంపాడులో నివాళులర్పిస్తున్న స్వామిదాసు, నాయకులు

తిరువూరు: పాకిస్తాన్ దురాక్రమణను అడ్డుకునే ప్రయత్నంలో అమరవీరుడైన భారత సైనికుడు మురళీనాయక్ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు సోమవారం నివాళులర్పించారు. ఏ.కొండూరు మండలం కంభంపాడులో జరిగిన కార్యక్రమంలో మురళీనాయక్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, ఏ.కొండూరు మండల పార్టీ అధ్యక్షుడు భూక్యా గన్యా, వైఎస్సార్ సీపీ నాయకులు కాలసాని చెన్నారావు, ధర్మానాయక్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సమాజ సేవకులు నర్సులు



స్టాఫ్ నర్సు శశిరేఖను సత్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, డీఎంహెచ్‌వో సుహాసిని



నిమ్రా కళాశాలలో మాట్లాడుతున్న నారాయణమూర్తి

ఇబ్రహీంపట్నం: నర్సులు నిస్వార్థ సమాజ సేవకులు అని నిమ్రా విద్యా సంస్థల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ తమ్మినైనా నారాయణమూర్తి తెలిపారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవాన్ని నిమ్రా నర్సింగ్ కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నారాయణమూర్తి మాట్లాడుతూ.. ఫ్లారెన్స్ నైటింగేల్ సమాజం కోసం సేవ చేసేందుకు ముందుకు వచ్చి ప్రపంచంలో మొట్టమొదటి నర్సుగా పిలవబడిందన్నారు. ఆమె జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని చెప్పారు. మనిషి పుట్టుక నుంచి చావు వరకు ప్రతి ప్రయాణంలో నర్సుల అవసరం ఉంటుందన్నారు. సేవా దృక్పథం కలిగిన వారు మాత్రమే నర్సింగ్ వృత్తిని ఎంచుకుంటారని, సమాజానికి ఉపయోగపడే నర్సులుగా నిమ్రా నర్సింగ్ కళాశాల విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోకిల, అధ్యాపకులు అఖిల్ బుల్లిబాబు, అనూష, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులకు సన్మానం

తిరువూరు: ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా సోమవారం తిరువూరులో పలువురు స్టాఫ్ నర్సులను జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే శ్రీనివాసరావు సన్మానించారు. తిరువూరు కమ్యూనిటీ ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్ పీ శశిరేఖ, గంపలగూడెం పీహెచ్‌సీ స్టాఫ్ నర్స్ మేరీకుమారి, జీ కొండూరు, కంచికచర్ల ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న జెనిమా, స్వర్ణకుమారి, సర్వజన ఆస్పత్రి స్టాఫ్ నర్స్ సీహెచ్ సుమతను సత్కరించారు. నందిగామ ఏరియా ఆస్పత్రి స్టాఫ్ నర్స్ జాన్‌కు ఉత్తమ సేవల పురస్కారాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి ఎం.సుహాసిని, అధికారులు అందజేశారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు



నూజివీడు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. పెద్దలను గౌరవించాలని, సమయాన్ని వృథా చేయొద్దని సూచించారు. సెల్‌ఫోన్, టీవీలు చూడటం కంటే మంచి పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధనకు కష్టపడి చదివితేనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. కథలు చదవడం ద్వారా నైతిక విలువలు పెరుగుతాయని, కథలు చదవడం అనేది అలవాటుగా మార్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తదితరులు

మైలవరం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి హనిమిరెడ్డి స్టేడియంలో వసంత సమ్మర్ కబడ్డీ టోర్నమెంట్ – 2025ను విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్(చిన్ని) సోమవారం ప్రారంభించారు. యువత క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ఎంపీ సూచించారు. మైలవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత క్రీడాకారులను అభినందించారు. జి.కొండూరు మండల పరిధిలోని చెవుటూరు, కుంటముక్కల గ్రామాల జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌ను ప్రజాప్రతినిధులు తిలకించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డుపై పడిన చెట్ల తొలగింపు



చాట్రాయి: గాలి వానకు రోడ్డుపై పడిన చెట్లను ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. చాట్రాయి – పోలవరం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న మర్రి చెట్టు ఇటీవల వీచిన భారీ గాలికి రోడ్డుపై పడింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో ఎస్ఐ జేసీబీతో తొలగించారు.

పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా మహ్మద్ ఇర్ఫాన్



ఇబ్రహీంపట్నం: పీఆర్టీయూ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కాచవరం పాఠశాలలో ఉర్దూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మహ్మద్ ఇర్ఫాన్ పాషాను నియమించినట్లు పీఆర్టీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు షేక్ నవాబ్‌జానీ, సోలా రాఘవరాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ పాషా మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. పాషాకు ఇబ్రహీంపట్నం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాతినేని నాగబాబు, మహమ్మద్ బాజనీ తదితరులు అభినందనలు తెలిపారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

ఆగిరిపల్లి: కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జీఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. ఆగిరిపల్లిలో సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ఇప్పటికైనా కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం ఆగిరిపల్లి మండల కార్యదర్శి చాకిరి శివ నాగరాజు, నాయకులు ముత్యాల నరేష్, స్టాలిన్ పాల్గొన్నారు.

వేంకటాచల స్వామివారికి గరుడ వాహన సేవ



తిరువూరు: స్థానిక పాత తిరువూరులో వేం చేసి ఉన్న శ్రీవేంకటాచలస్వామి ఆలయంలో వైశాఖ పూర్ణిమ సందర్భంగా సోమవారం గరుడ వాహన సేవ నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు అనంతరం ఆలయం చుట్టూ గరుడ వాహనంపై ఊరేగించారు. వైష్ణవ గోష్ఠి సభ్యులు స్వామివారి సంకీర్తనలు చేస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

షిర్డీసాయిబాబాకు లక్ష మల్లెల అర్చన



విస్సన్నపేట: స్థానిక షిర్డీ సాయి మందిరం 21వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. మందిర కమిటీ ఆధ్వర్యంలో బాబావారికి లక్ష మల్లెలతో అభిషేకం, విశేష పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అభివృద్ధి పనులపై అప్రమత్తంగా వ్యవహరించాలి



ముసునూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీఓ బీపీ సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి పనులపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పన్నుల వసూలు వేగవంతం చేయాలని, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, మంచినీటి సరఫరా విషయంలో ముందస్తు ప్రణాళికలతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.